సాక్షి
కామారెడ్డి
సోమవారం । 29 । మే । 2023



స్టేడియం నిర్మాణానికి నిధులు

తాడ్వాయిలో నిలిచిన స్టేడియం నిర్మాణానికి నిధులు విడుదల కావడంపై క్రీడాకారులు, యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- 9లో ▸



రాష్ట్రంలోనూ కర్ణాటక ఫలితాలు

బీజేపీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా రాష్ట్రంలోనూ కర్ణాటక తరహా ఫలితాలు రానున్నాయని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
41.4 /29.5

వాతావరణం

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. సాయంత్రం చిరుజల్లులు కురుస్తాయి. వాతావరణం చల్లబడుతుంది.

విపక్షాలపై హరీశ్‌రావు ఫైర్!

- కాంగ్రెస్‌కు కాలం చెల్లింది.. బీజేపీ సప్పుడు బంద్దైంది
- మూడోసారి కూడా అధికారం బీఆర్‌ఎస్‌దే..
- బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపిన మంత్రి పర్యటన



లింగంపేటలో ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే జాజాల, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ

సాక్షి, కామారెడ్డి : తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ పార్టీ మూడో సారి అధికారం చేపట్టి హ్యాట్రిక్ కొట్టడం ఖాయం. ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయి. విషం చిమ్మే ప్రయత్నాలను విషయంతో తిప్పికొట్టాలి. కాంగ్రెస్‌కు కాలం చెల్లింది. బీజేపీ సప్పుడు బంద్దైంది' అని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖల మంత్రి టి. హరీశ్‌రావు అన్నారు. విపక్ష పార్టీలపై హరీశ్‌రావ్ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఎల్లారెడ్డి నియోజక వర్గంలో ఆదివారం పర్యటించారు. లింగంపేట మండల కేంద్రంలో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2001లో టీఆర్‌ఎస్ పురుడు పోసుకున్నపుడు సురేందర్ పార్టీ జెండా మోసిన అసలుసిసలైన ఉద్యమకారుడని హరీశ్‌రావ్ పేర్కొన్నారు. అప్పుడు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎల్లారెడ్డి నియోజక వర్గంలో జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవడం వల్లే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిషత్‌పై గులాబీ జెండా ఎగిరిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో నలబై, యాబై నియోజక వర్గాల్లో అభ్యర్థులే లేరని, ఊక దంపుడు ఉపన్యాసాలు ఇస్తూ అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టకుంటే అబద్దాలు రాజ్యమేలుతాయన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ఏమొచ్చిందని ప్రశ్నించే కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఏ ఊరుకు పోయినా అభివృద్ధి కనబడుతుందన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక మిషన్ భగీరథతో ఇంటింటికీ నల్లాలతో మిషన్ భగీరథ నీళ్లు వచ్చాయని, 24 గంటల పాటు వ్యవసాయానికి ఉచితంగా కరెంటు వచ్చిందని, మిషన్ కాకతీయతో చెరువులు బాగుపడి బోర్లు, బావుల్లో నీటి ఊటలు పెరిగాయని మంత్రి వివరించారు. డబుల్ ఇంజన్ సర్కార్ల పాలన ఉన్న యూపీ, మహారాష్ట్రల్లో తాగునీళ్లకు ఎన్ని కష్టాలు పడుతున్నారో అక్కడి ప్రజలను అడిగితే తెలుస్తుందన్నారు. తెలంగాణలో కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య లక్ష్మి, ఆరోగ్య మహిళ వంటి పథకాలు, ఆసరా ఫించన్లు ఇంటింటా కనిపిస్తాయన్నారు. తెలంగాణలో పేద పిల్లల పెళ్లిళ్లకు రూ. లక్ష సాయం చేస్తున్నామని, గుజరాత్‌లో రూ. 12 వేలు ఇస్తారని అది కూడా రెండేళ్లకు వస్తాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రకృతి వైపరీత్యాల కన్నా డేంజర్ అని దుయ్యబట్టారు. హరీశ్‌రావు పర్యటన బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. కార్యకర్తలు పార్టీకి ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు.

మూడోసారి అధికారం మనదే..

కేసీఆర్ నాయకత్వంలో కొట్లాడి రాష్ట్రం సాధించుకున్నామని, ప్రజలు కేసీఆర్ నాయకత్వంపై విశ్వాసంతో రెండుసార్లు అధికారం ఇచ్చారని, మూడోసారి కూడా గెలిచి హ్యాట్రిక్ సాధిస్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన సురేందర్ సౌమ్యుడని, ఈసారి కూడా ఆయనే విజయం సాధిస్తాడని పేర్కొన్నారు.

త్వరలో ఎల్లారెడ్డికి సీఎం..

ఎల్లారెడ్డి నియోజక వర్గానికి త్వరలోనే సీఎం కేసీఆర్ వస్తారని, పెద్ద ఎత్తున వరాలు తీసుకుందామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే సురేందర్ తపిస్తున్నాడని తెలిపారు. కేసీఆర్‌కు ఎల్లారెడ్డి మీద ప్రత్యేకమైన అభిమానం ఉందని తెలిపారు. సురేందర్ గెలుపును ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. కాగా మంత్రి రాక సందర్భంగా మెంగారం నుంచి లింగంపేట వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఓపెన్ టాప్ జీపులో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులున్నారు. వందలాది బైకులు ముందుకు కదిలాయి. ఎన్నికల ప్రచార ర్యాలీని తలపించింది. సభలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ దఫెదార్ శోభ, ఫుడ్ కమీషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముజీబొద్దీన్, ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యం, జెడ్పీటీసీ సభ్యులు మనోహర్‌రెడ్డి, శ్రీలత, శంకర్‌నాయక్, ఎంపీపీలు దశరథ్‌రెడ్డి, గరీబున్నీసా, మాధవి, అనసూయ, మార్కెట్ కమిటీ చైర్మన్లు సత్యంరావ్, నారాయణ, నాయకులు తానాజీరావ్, ప్రతాప్‌రెడ్డి, రాజేశ్వర్‌రావ్, దఫెదార్ రాజు, ముకుందరావ్, శివాజీరావ్, ముదాం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలు

ఎవరైనా మన ప్రాంతం గురించి గొప్పగా చెప్పుకోవాల్సింది పోయి.. మన రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కొన్ని పార్టీలు దుష్ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలో జరగుతున్న అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మహారాష్ట్రంలో అక్కడి రైతులు తెలంగాణలో ఉన్నట్టుగా రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంటు అడుగుతున్నారని తెలిపారు. తెలంగాణలో ఆసరా పింఛన్లు రూ. 2 వేలు ఇస్తున్నామని, దేశంలో మరెక్కడా ఇవ్వడం లేదన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దేశంలో ఎక్కడా లేవన్నారు.



లింగంపేటలో రోడ్‌షోలో పాల్గొన్న మంత్రి



గజమాలతో మంత్రి హరీశ్‌రావుకు సన్మానం

ప్రభుత్వాస్పత్రుల్లో పెరిగిన ప్రసవాలు

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ప్రభుత్వ ఆస్పత్రులలో 63 శాతం ప్రసవాలు జరుగుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిలో రూ. 15 కోట్ల నిర్మించనున్న వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేయగా గండిమాసానిపేటలో బస్తీ దవాఖానాను జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు తెలంగాణ ప్రాంతంలో 3 డయాలసిస్ కేంద్రాలుండగా నేడు తెలంగాణ ఏర్పడిన తర్వాత 102 డయాలసిస్ కేంద్రాలను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. బాల్కొండ నియోజకవర్గానికి డయాలిసిస్ కేంద్రం మంజూరైందన్నారు. డయాలసిస్ రోగులకు ఉచిత బస్‌పాస్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయగా, కామారెడ్డిలో 500 పడకలు, బాన్సువాడలో 250 పడకల ఆస్పత్రి మంజూరైందన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సీఎంతో పట్టుబట్టి ఎల్లారెడ్డి నియోజకవర్గానికి వంద పడకల ఆస్పత్రిని మంజూరు చేయించుకున్నారన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో వంద పడకల నిర్మాణంతో పాటు, ఐసీయూ, సిటీ స్కాన్, టీఫా స్కానింగ్ వసతులను కల్పిస్తామన్నారు. కామారెడ్డిలో ఈఏడాది నుంచి అడ్మిషన్లు తీసుకుంటామని, నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి అనుమతులు వచ్చాయన్నారు. సొంత జాగా ఉన్నవాళ్లు దరఖాస్తు చేసుకుంటే రూ.3లక్షలు ఇస్తామన్నారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే జాజాల సురేందర్, జెడ్పీ చైర్మెన్ దఫేదార్ శోభా, మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ, జెడ్పీటీసీ ఊషాగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీకాంత్, నీలకంఠం, రాము, సాయిలు, గాంధారి మార్కెట్ కమిటీ చైర్మెన్ సత్యంరావు, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు సతీష్, సర్పంచులు, ఎంపీటీసీలు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఆర్డీవో శ్రీను, తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఇంచార్జి కమీషనర్ రమేష్‌కుమార్, ఇంచార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శోభారాణి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్, మత్తమాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్‌లో చేరిన ఎంపీపీ దంపతులు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. లింగంపేట మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి వచ్చిన మంత్రి హరీశ్‌రావు సమక్షంలో ఎంపీపీ మాధవి దంపతులు బాల్‌రాజ్‌గౌడ్‌లో కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి హరీశ్‌రావు బీఆర్‌ఎస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సురేందర్ తదితరులున్నారు.

పాడె మోసిన ఎమ్మెల్యే సింధే



మద్నూర్(జుక్కల్) : మండలంలోని సోనాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు విజయ్ పాటిల్ దారుణ హత్యకు గురవ్వడం మండలంలో కలకలం రేపింది. సొంత అన్న చేతిలో హత్యకు గురైన విజయ్ పాటిల్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. ఆయన మృతి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే సింధే హుటాహుటిన సోనాలకు చేరుకుని జరిగిన విషయంపై ఆరా తీశారు. ఆదివారం సాయంత్రం గ్రామంలో జరిగిన విజయ్ పాటిల్ అంత్యక్రియలకు జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే హాజరై మృతుడి పాడె మోసి ఆవేదన వ్యక్తం చేశారు. మద్నూర్, డోంగ్లీ మండలాల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

కాలభైరవుడిని దర్శించుకున్న సివిల్ జడ్జి



రామారెడ్డి : ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి రామారెడ్డి శ్రీకాళభైరవ స్వామిని కామారెడ్డి సివిల్ జడ్జి దంపతులు ఆదివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన కామారెడ్డి సివిల్ జడ్జి భార్గవిని ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కాలభైరవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సివిల్ జడ్జి భార్గవి దంపతులను ఆలయ సిబ్బంది సన్మానించి కాలభైరవుడి చిత్రపటాన్ని అందజేశారు.

న్యాయం చేయాలని 98 డీఎస్సీ అభ్యర్థుల వినతి

లింగంపేట(ఎల్లారెడ్డి) : రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు 98 డీఎస్సీ అభ్యర్థులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 98 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. 1998 డీఎస్సీలో క్వాలిఫై అయి ఇంటర్వ్యూకు హాజరై ప్రభుత్వం నిర్దేశించిన కనీస అర్హత మార్కులు సాధించి ఉన్నామన్నారు. ఏపీలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి 4,567 మందికి ఎంటీఎస్ పద్ధతిలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు జీవో విడుదల చేశారన్నారు. రాష్ట్రంలో 1,500 మంది క్వాలిఫై అయినవారు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులు లక్ష్మణ్‌రావు, ఖాదర్‌సిద్ధిఖీ, ఖాలీఖ్ సిద్ధిఖీ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



నిజాంసాగర్: సివిల్స్‌లో 200 ర్యాంకు సాధించిన బోధన్‌కు చెందిన కంఠం మహేష్‌ను ఆదివారం నవోదయ పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. 2010లో ఆయన నవోదయలో పదో తరగతి చదివాడు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల వినయ్‌శంకర్, కార్యదర్శి అనిల్‌కుమార్ యాదవ్, కోశాధికారి రేణుక కుమారి, ఫౌండర్ ప్రెసిడెంట్ వెంకటరమణగౌడ్, బచ్చు వెంకటేశ్, నాగవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

- రోడ్ల అభివృద్ధికి రూ. 80 కోట్ల నిధులు తెచ్చా
- అభివృద్ధి చేసేవాళ్లకే ఓటు వేయండి
- బీర్కూర్‌లో స్పీకర్ పోచారం

నస్రుల్లాబాద్(బీర్కూర్) : అభివృద్ధి కోసమే తాను పనిచేస్తున్నానని, ప్రజలకు సేవ చేయడం తన బాధ్యత అని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బీర్కూర్ మండల కేంద్రంలో రూ.7.20 కోట్లతో సెంట్రల్ లైటింగ్, డివైడర్, సైడ్ డ్రెయినేజీలతో నూతనంగా నిర్మించే ఫోర్‌లైన్ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 1.10 కోట్లతో బీర్కూర్ నుంచి మల్లాపూర్ క్యాంప్ మీదుగా వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు సీసీ రోడ్డుకు, రూ. 10 లక్షలతో మున్నూరు కాపు సంఘం భవన ప్రహరీకి శంకుస్థాపన చేశారు. రూ. 10 లక్షలతో బరంగేడ్గిలో నిర్మించే పరమేశ్వర ఆలయానికి భూమి పూజ చేశారు. అనంతరం బీర్కూర్‌లోని మున్నూరు కాపు సంఘంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డి నుండి బాన్సువాడ మీదుగా రుద్రూరు వరకు రోడ్డును విస్తరించేందుకు స్వయంగా తానే ఢిల్లీ వెళ్లి కేంద్ర రవాణశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం ఇచ్చానన్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం రూ. 500 కోట్లు మంజూరయ్యాయని, రుద్రూరు, నస్రుల్లాబాద్ మండల కేంద్రాలలో కూడా ఫోర్ లైన్ నిర్మాణం అవుతుందన్నారు. అదేవిధంగా మద్నూర్ నుండి పోతంగల్ మీదుగా బోధన్ వరకు జాతీయ రహదారి నిర్మాణానికి రూ. 470 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. నియోజకవర్గంలో రోడ్ల విస్తరణకు అభివృద్ధికి ఇప్పటికే రూ. 80 కోట్ల నిధులు తెచ్చానన్నారు. బాన్సువాడ నుంచి తానే పోటీ చేస్తానని వయస్సు మీద పడుతున్నా సీఎం ఇచ్చిన ప్రోత్సాహంతో యువకుడిలా పనిచేస్తున్నానని స్పీకర్ పోచారం పేర్కొన్నారు. ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ స్వరూప, బీఆర్‌ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, నాయకులు లాడెగాం గంగారాం, వీరేశం, దుంపల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి సంచారంతో భయాందోళనలో ప్రజలు



తాడ్వాయిలోని సంగోజివాడి శివారులో ఎలుగుబంటిని తరుముతున్న గ్రామస్తులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండలంలోని సంగోజివాడి గ్రామ శివారులో ఎలుగుబంటి సంచరించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంగోజివాడి శివారులో శనివారం ఎలుగుబంటి సంచరించడంతో అది గమనించిన గ్రామస్తులు ఎలుగుబంటి వెంబడించి తరిమికొట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన బాలసాయిలుపై ఎలుగుబంటి దాడిచేసి గాయపర్చింది. దీంతో గ్రామస్తులు కర్రలతో వెండించినప్పటికి ఎలుగుబంటి దొరకలేదు. కాగా ఆదివారం కూడా గ్రామస్తులు ఎలుగుబంటి కోసం గాలించినా ఎలుగుబంటి కనిపించలేదు. దీంతో సంగోజివాడితో పాటు చుట్టుపక్కన ఉన్న చందాపూర్, కాలోజీవాడి, బ్రాహ్మణపల్లి గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. ఫారెస్ట్ అధికారులు చొరువ తీసుకొని ఎలుగుబంటిని పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గాలివాన బీభత్సం..

- తడిసిన ధాన్యం, మొక్కజొన్న
- గాలికి ఎగిరిన ఇళ్ల పైకప్పులు

గాంధారి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం గాలి దుమారంతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న ఈ వర్షానికి భారీ వర్షం వరదకు కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురుగాలికి జువ్వాడి, బ్రాహ్మణ్‌పల్లి తదితర గ్రామాల్లో రేకుల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయి బాధిత కుటుంబాలు వీధిన పడ్డాయి. ఇళ్లలో ఉన్న తిండి గింజలు, దుస్తులు తదితర సామాన్లు వర్షం నీటికి తడిసిపోయాయి. ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్‌కు అంతరాయం కలిగింది. ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.



గాంధారిలో గాలికి ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

తాడ్వాయిలో భారీ వర్షం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండలంలో ఆదివారం వర్షం కురియడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఉరుములు, మెరుపులు, గాలి దుమారంతో కూడిన వర్షం పడడంతో మక్కలు, వడ్లు తడిసి పోయాయి. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోయగా ఒకేసారి వర్షం రావడంతో రైతులు నానా తంటాలు పడ్డారు. కొనుగోలు కేంద్రాల వద్ద తూకం యంత్రాలను పెంచి తొందరగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



తాడ్వాయిలోని దేవాయిపల్లి శివారులో కొనుగోలు కేంద్రం వద్ద కప్పి ఉంచిన వడ్లు

పెరుగుతున్న ఆర్థిక నేరాలు

- జిల్లాలో అడుగడుగునా మోసగాళ్లు
- అధిక వడ్డీలు, రుణాలు ఇస్తామంటూ పుట్టుకొస్తున్న డొల్ల కంపెనీలు
- డబ్బులు కట్టి మోసపోతున్న జనం
- నివారణ చర్యలు శూన్యం

కామారెడ్డి క్రైం : జిల్లాలో ఆర్థిక నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. డిపాజిట్‌లపై అధిక వడ్డీ, తక్కువ వడ్డీకే గృహ రుణాలు, లాభాలు అంటూ తమ కంపెనీలలో పెట్టుబడులు పెట్టిస్తూ అందిన కాడికి దండుకుని చేతులెత్తేస్తున్నారు. కామారెడ్డిలో ఇలాంటి డొల్ల కంపెనీల లీలలు ఇటీవల ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి.

పేద, మధ్య తరగతి వాళ్లే టార్గెట్..

పేదలు, మధ్యతరగతి కుటుంబాలు తాము పోగు చేసుకున్న డబ్బును మంచి లాభాలు వచ్చే చోట పెట్టుబడులుగా పెట్టాలని అవసరానికి డబ్బులు అందేలా ఏర్పాట్లు చేసుకోవాలని భావిస్తారు. ఇదే అదనుగా చేసుకుంటూ ఘరానా మోసగాళ్లు డొల్ల కంపెనీల పేరిట దోపిడీ పర్వానికి తెర లేపుతున్నారు. గడిచిన పక్షం రోజుల్లోనే కామారెడ్డిలో ఇలాంటి ఘటనలు రెండు చోట్ల వెలుగు చూశాయి. మండలంలోని చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో జీడీఎఫ్‌సీ నిధి లిమిటెడ్ పేరిట ఓ సంస్థను ప్రారంభించి తమ సంస్థలో పెట్టుబడులు పెడితే డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తామని, తక్కువ వడ్డీకే రూ. 3 లక్షల చొప్పున గృహరుణాలు అందిస్తామని నమ్మించారు.

గ్రామాల వారీగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని సంస్థ కార్యకలాపాలను ప్రారంభించారు. 5 వందల మందికి పైగా కస్టమర్ల వద్ద నుంచి రూ. 20 లక్షలకు పైగా డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేశారు. గాంధారి మండలం మాతుసంగెం, పేట్‌సంగెం, తాడ్వాయి, క్రిష్టాజీవాడి, లింగాపూర్, బీబీపేట తదితర గ్రామాలకు చెందిన బాధితులు మోసపోయామంటూ పోలీసులను ఆశ్రయించారు. తమ సంస్థలో రూ.లక్ష చొప్పున పెట్టుబడులు పెడితే నెలకు రు. 10 వేల చొప్పున ఆదాయం పొందవచ్చని నమ్మించి ఇద్దరు వ్యక్తులు ఓ కంపెనీ పేరుతో నమ్మించారు. ఈ ఘరానా మోసం జిల్లా కేంద్రంలో వారం రోజుల క్రితం వెలుగు చూసింది. హైదరాబాద్‌లోని కిసాన్‌భాగ్‌లో నివాసం ఉండే షహనాజ్ బేగం, ఆమె డ్రైవర్ సయ్యద్ హమీద్ ఈ మోసానికి పాల్పడ్డారు. జిల్లా కేంద్రానికి చెందిన 21 మంది మొదటగా రూ. లక్ష చొప్పున పెట్టుబడులు పెట్టారు. ఆ తర్వాత వారిని చూసి మరో 20 మంది ఇతర ప్రాంతాలకు చెందిన వారి పెట్టుబడులు పెట్టారు. ఒక్కొక్కరూ లక్ష చొప్పున పెట్టుబడి పెట్టగా ఒకటి, రెండు నెలలు మాత్రం ప్రతినెల ఒకొక్కరికి రూ.10 వేల చొప్పున పంపించారు. ఆ తర్వాత చేతులెత్తేశారు. గతంలో కూడా బీర్షబా పేరిట ఓ కంపెనీ పెట్టి వేల సంఖ్యలో సభ్యులను చేర్చుకుని రూ. వందల కోట్లు కాజేసిన విషయం తెలిసిందే. అంతేగాకుండా దేవునిపల్లిలోని దేవీవిహార్‌లో ఉండే ఓ వ్యక్తి వాహనాలను తక్కువ ధరకు ఇప్పిస్తామంటూ తమ కంపెనీలో పెట్టుబడులు పెట్టించుకుని రూ. కోట్లలో డబ్బులు కట్టించుకుని ఉడాయించాడు.



దేవునిపల్లి ఠాణాకు తరలివచ్చిన బాధితులు (ఫైల్)

రోజుకో కొత్త కంపెనీ..

ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న వారిపై నిఘా కొరవడింది. గ్రామాల్లోని నిరుద్యోగులు, ఆర్ఎంపీ వైద్యులు, ఎల్ఐసీ ఏజెంట్లకు కమీషన్‌లను ఆశ చూపించి వారి ద్వారా మాయమాటలు చెప్పిస్తూ సభ్యులను చేర్చుకుంటున్నారు. అనుమతులు లేని కంపెనీలు మార్కెట్‌లో తమ కార్యకలాపాలను గుట్టుగా నడిపిస్తున్నా పోలీసులు, సంబంధిత శాఖల అధికారుల నిఘా లేదనే విమర్శలున్నాయి.


చర్యలు తీసుకుంటాం



అధిక లాభాలు, వడ్డీల పేరుతో ప్రజలను మోసాలకు గురిచేశారని ఇదివరకు కొంతమంది ఫిర్యాదు చేశారు. వారిపై వెంటనే కేసులు పమోదు చేశాం. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహించరాదు. ఎవరైనా మోసపోయిన వారు ఉంటే ఫిర్యాదు చేయాలి. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– నరేశ్, పట్టణ ఎస్‌హెచ్‌వో, కామారెడ్డి

సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 28 । మే । 2023



ఏళ్ల కల.. నెరవేరనుంది

పోచారం కాలువపై వంతెన నిర్మాణం కోసం ఏళ్లుగా లింగంపల్లికలాన్ ప్రజలు ఎదురు చూస్తుండగా ఎట్టకేలకు కదలిక వచ్చింది.

- 9లో ▸



ప్రతి గింజ కొనేది..

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనేది దేశం మొత్తం మీద సీఎం కేసీఆరేనని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.1 /28.7

వాతావరణం

ఉదయం నుంచే ఎండ ప్రకాశవంతంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాకు మంచి పేరు తేవాలి



కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న జిల్లా పోలీసు శాఖ క్రీడలు శనివారం ముగిశాయి. ముగింపు వేడుకలకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. గెలుపొందిన క్రీడాకారులకు కలెక్టర్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిలు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకువస్తున్నారన్నారు. ఏఆర్ విభాగం జట్టు ఎక్కువ క్రీడల్లో గెలుపొంది విజేతగా నిలిచింది. కార్యక్రమంలో ఏఎస్పీ అన్యోన్య, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

కామారెడ్డి క్రైం: జూన్ 2న నుంచి 22 వరకు జరిగే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కోసం ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో కార్యాలయంలో శనివారం దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జూన్ 2న జరిగే ప్రారంభోత్సవ వేడుకలకు పథకావిష్కరణను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేస్తారని తెలిపారు. 3న తెలంగాణ రైతు దినోత్సవం వేడుకలు క్లస్టర్ పరిధిలోని రైతు వేదికలో నిర్వహించాలన్నారు. 4న సురక్ష దినోత్సవం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాభారతిలో నిర్వహిస్తారని తెలిపారు. 5న విద్యుత్తు రంగంలో సాధించిన విజయాలను నియోజకవర్గాల పరిధిలో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు తెలియజేయాలని సూచించారు. 6న తెలంగాణ పారిశ్రామిక ప్రగతిలో భాగంగా జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. 7న సాగునీటి దినోత్సవం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు రిపోర్టు చేయాలి

కామారెడ్డి అర్బన్: ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ కోసం ఈనెల 21న నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదలైనందున ఎంపికైన అభ్యర్థులు సోమవారం నుంచి రిపోర్టు చేయాలని ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అభివృద్ధి అధికారి వెంకటేశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29, 30, 31 తేదీల్లో నిజామాబాద్‌లోని స్టడీ సర్కిల్‌లో ప్రవేశం పొందాలని జిల్లా అభివృద్ధి అధికారి సూచించారు. తరగతులు జూన్ 1 నుంచి ప్రారంభమై అక్టోబర్ వరకు నిర్వహిస్తారన్నారు.



ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో చిక్కిన భారీచేపతో మత్స్యకారుడు ప్రవీణ్

అమ్మ తర్వాత గంగమ్మే..!

■ గోదావరితో పెనవేసుకున్న గంగపుత్రుల బతుకులు ■ ఇంట్లో కంటే గంగమ్మ ఒడిలోనే ఎక్కువసేపు జీవనం ■ నిత్యం కిలోమీటర్లు ప్రయాణించి చేపల వేట
■ కుటుంబ పోషణ కోసం నీటిలో సాహసం ■ డొంకేశ్వర్ మండలంలో వెయ్యికి పైగా మత్స్యకార కుటుంబాలు

ఏళ్ల తరబడిగా చేపలు పట్టే వృత్తిని కొనసాగిస్తూ గోదావరితో ఎనలేని బంధాన్ని పెనవేసుకున్నారు మత్స్యకారులు. ఇంట్లో కుటుంబ సభ్యుల కంటే గంగమ్మ ఒడిలోనే ఎక్కువ సేపు జీవనాన్ని గడుపుతుంటారు. డొంకేశ్వర్ మండల పరిధిలోని గ్రామాలన్నీ దాదాపుగా గోదావరికి ఆనుకుని ఉన్నాయి. అన్నారం, సిర్పూరం, నడ్కుడ, గాదెపల్లి, చిన్నయానం, నూత్‌పల్లి, నికాల్‌పూర్, డొంకేశ్వర్, దత్తాపూర్, మారపంల్లి, గంగసముందర్ గ్రామాల్లో గంగపుత్రుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. గ్రామాల న్నీ కలిపి మండలంలో మొత్తం వెయ్యికి పైగా మత్స్యకార కుటుంబాలున్నాయి. ఇందులో 60 శాతం మంది మత్స్యకారులు ఆయా గ్రామాలకు ఆనుకుని ఉన్న ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతానికి వెళ్ళి చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నారు.



డొంకేశ్వర్ మండలం గోదావరి పరీవాహక ప్రాంతంలో చేపలు పట్టడానికి ఉదయమే బైక్‌లపై బయలుదేరిన మత్స్యకారులు



గోదావరి పరీవాహక ప్రాంతం వద్ద మత్స్యకారులు

డొంకేశ్వర్ మండలంలో వెయ్యికి పైగా మత్స్యకార కుటుంబాలు గోదావరి నదితో జీవనాన్ని పెనవేసుకున్నాయి. చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు ఇంట్లో కుటుంబ సభ్యుల కంటే గంగమ్మ ఒడిలోనే ఎక్కువ సేపు గడుపుతారు. గంగమ్మకు మొక్కకుండా నీటిలో అడుగు కూడా పెట్టరు. వీరి దినచర్య ఆసక్తికరంగానే ఉంటుంది. సూర్యోదయానికి ముందే నిద్రలేస్తారు. గ్రూపులుగా విడిపోయి చేపల వేటకు బయలు దేరుతారు.

–డొంకేశ్వర్(ఆర్మూర్)

సూర్యోదయం కంటే ముందే..

మండలంలోని చుట్టు పక్కల గ్రామాల్లోని గంగపుత్రుల జీవన విధానాన్ని చూస్తే ఆసక్తికరంగా ఉంటుంది. చేపల వేటకు వెళ్లడానికి ఒకరోజు ముందే గ్రూప్‌లుగా ఏర్పడుతారు. మరుసటి రోజు తెల్లవారక ముందే ఉదయం 4 గంటలకు లేచి ఇళ్ల నుంచి బైక్‌లపై కలిసికట్టుగా పయనమవుతారు. సూర్యుడు ఉదయించక ముందే గోదావరి తీరాలకు చేరుకుంటారు. ప్రస్తుతం వేసవి కావడంతో బ్యాక్ వాటర్ లోపలికి వెళ్లిపోయింది. దీంతో 11 కిలోమీటర్లు గోదావరి పచ్చిక బయళ్లలోనే ప్రయాణం చేసి ఉదయం 5 గంటల ప్రాంతానికల్లా గమ్యానికి చేరుతారు. వెంటనే దుస్తులు మార్చుకుని తెప్పల సాయంతో గంగలోకి దిగుతారు. తిరిగి మధ్యాహ్నం, లేదా సాయంత్రం ఇంటిబాట పడుతారు. ఇలా గోదారిలో చేపలు పట్టేవారి సంఖ్య దాదాపుగా 230కి పైనే ఉంటుంది.

సండే స్పెషల్

గంగమ్మ వెనక్కి తగ్గితేనే చేపలు చిక్కేది..

సాధారణంగా గోదావరిలో నీళ్లు ఎక్కువగా ఉంటే మత్స్యకారులకు చేపల వేట ఇబ్బందిగానే ఉంటుంది. అలలు, గాలులు తీవ్రంగా ఉంటే గంగలోకి దిగడానికి సాహసించరు. అయితే, వర్షా, చలికాలాల కంటే వేసవిలోనే చేపలు ఎక్కువగా దొరుకుతా యని గంగపుత్రులు పేర్కొంటున్నారు. ఎందుకంటే ఎండాకాలంలో బ్యాక్‌వాటర్ ఎండిపోయి నీళ్లు తగ్గుతాయి. తద్వారా చేపల వేట సులభమవుతుంది. ఒక్కోసారి చేపలు దొరకని పక్షంలో సాహసం చేసి నీటిలో రెండు కిలోమీటర్ల లోపలికి వెళ్తారు. అప్పటికీ చేపలు పడకపోతే ఆ రోజు ఆ కుటుంబానికి ఉపాధి లేనట్లే. వాహనాల్లో పెట్రోల్ పోసుకుని దూర ప్రాంతానికి వచ్చి చేపలు పడకపోతే గంగపుత్రుల కళ్లల్లో సంతోషం కనిపించదు. ఎందుకంటే చేపలు అమ్మగా వచ్చిన డబ్బులతోనే కుటుంబాల పోషణ జరిగేది.

దళారులకే విక్రయించాల్సిన పరిస్థితి..

పడిన చేపలను విక్రయించడానికి మత్స్యకారులకు దళారులే దిక్కయ్యారు. ప్రభుత్వం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల ఎగుమతి చేయడం లేదు. దీంతో వీరే కలకత్తా, నాగ్‌పూర్, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాలను ఎగుమతి చేసి అమ్ముతున్నారు. తద్వారా తక్కువ రేటు వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రమాద బీమాను పెంచి, చేపలను నిల్వ ఉంచేందుకు కోల్డ్ స్టోరేజీలను, విక్రయించడానికి చేపల మార్కెట్లను నిర్మించివ్వాలని కోరుతున్నారు.



గోదావరిలో తెప్పల సాయంతో చేపలు పట్టడానికి వెళ్తున్న మత్స్యకారులు

గోదారి తల్లే ఆధారం



“ మండలంలోని చుట్టు పక్కల గ్రామాల్లోని గంగపుత్రులకు గోదారి తల్లే జీవనోపాధి చూపిస్తోంది. గంగను నమ్ముకొనే మేమంతా జీవిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. గోదావరి మాకు పక్క నే ఉండడం మేంచేసుకున్న అదృష్టం. – మోహన్, మత్స్యకారుడు, డొంకేశ్వర్

ప్రభుత్వం గుర్తించాలి



“ గోదావరిలో సాహసం చేసి చేపలు పడుతున్న గంగపుత్రులను ప్రభుత్వం గుర్తించాలి. వాహన సదుపాయాలు, వలలు, తెప్పలు అందజేయాలి. ఇవి చాలా రోజుల క్రితం ఇచ్చారు. మళ్లీ ఇవ్వలేదు. చేపల వేటలో ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగమివ్వాలి. – సాయన్న, మత్స్యకారుడు, డొంకేశ్వర్

రోజంతా నదిలోనే..



“ గంగమ్మ తల్లి ఒడిలోనే ఎక్కువ సేపు పని చేస్తాం. ఉయాన్నే 5 గంటలకు చేరుకుని మధ్యాహ్నం వరకు చేపలు పడుతాం. మళ్లీ సాయంత్రం వచ్చి వలలు పెట్టి వెళ్లిపోతాం. దినచర్య మొత్తం గోదావరి వద్దే గడిచిపోతుంది. అన్నం పెట్టే గంగను పవిత్రంగా భావిస్తాం. – సాయికుమార్, మత్స్యకారుడు, అన్నారం

తొమ్మిదేళ్ల ప్రగతిని చాటాలి

- పండుగ వాతావరణంలో దశాబ్ది ఉత్సవాలు
- రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



దళితబంధు బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తదితరులు

సాక్షి, కామారెడ్డి: ‘కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సాధించుకుని తొమ్మిదేళ్లు పూర్తవుతోంది. తొమ్మిదేళ్లలో ప్రపంచం అబ్బురపడేలా అనేక కార్యక్రమాలు చేపట్టాం. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో అగ్రస్థానంలో నిలిచాం. తొమ్మిదేళ్లలో జరిగిన ప్రగతిని దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది’ అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాలు, హరితహారం, పోడు పట్టాలు, గొర్రెల పంపిణీ తదితర కార్యక్రమాలపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా దశాబ్ది ఉత్సవాలపై దిశానిర్దేశం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణను ఇతర రాష్ట్రాలు ఆసక్తిగా చూస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామాల వారీగా లెక్కలు తీసి కరపత్రాలు, బుక్‌లెట్ల రూపంలో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం రాకముందు 16 లక్షల ఎకరాల్లో వరి పండితే, ఇప్పుడు 56 లక్షల ఎకరాలకు చేరిందన్నారు. రాష్ట్రం పారిశ్రామిక ప్రగతితో పాటు ఐటీ రంగంలో దూసుకుపోతున్నామని తెలిపారు. తెలంగాణలో హనుమంతుని గుడి లేని ఊరు లేదని, కేసీఆర్ సంక్షేమ పథకాలు అందని ఇళ్లు లేవని చమత్కరించారు. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున జిల్లా కేంద్రంలో స్పీకర్ పోచారం జెండాను ఆవిష్కరించి జిల్లా ప్రగతిని వివరిస్తారని తెలిపారు. 21 రోజుల పాటు జరిగే కార్యక్రమాలన్నింటినీ పద్ధతిగా, పండుగ వాతావరణంలో జరపాలన్నారు. పోడు భూములకు పట్టాల పంపిణీ, ఇళ్ల స్థలాల పంపిణీ, బీసీ వృత్తుల వారికి రూ. లక్ష చొప్పున లబ్ధిదారులకు సాయం పంపిణీ కార్యక్రమాలు నిర్ణీత తేదీల్లో చేపట్టాలన్నారు. కామారెడ్డి జిల్లా ఏర్పాటుతో పాటు మెడికల్ కాలేజీ ఏర్పాటు అనేది గొప్ప విషయమని, దీన్ని ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. జిల్లాలో 4,480 మంది రైతులకు 12,969 ఎకరాల పోడు భూములకు పట్టాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు హన్మంత్ సింధే, జాజాల సురేందర్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, వైస్ చైర్మన్ ప్రేంకుమార్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, డీఎఫ్‌వో నిఖిత పాల్గొన్నారు.

మిషన్ భగీరథపై ప్రశ్నించిన మంత్రి, విప్

జిల్లాలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై కొద్దిసేపు మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, కలెక్టర్ పాటిల్ మిషన్ భగీరథ ఈఈని ప్రశ్నించారు. సమావేశం జరుగుతుండగా, కొద్ది సేపు వారి మైకులను ఆపేసి ఈఈని వేదిక దగ్గరకు పిలిపించి నీటి సరఫరాలో ఎందుకు ఆటంకాలు కలుగుతున్నాయని ప్రశ్నించారు. ఆటంకాలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

మిల్లర్ల దోపిడీపై మంత్రికి ‘గంప’ ఫిర్యాదు

రైస్‌మిల్లర్లు రైతులను పెడుతున్న ఇబ్బందులపై ఇస్రోజివాడీకి చెందిన రైతులతో కలిసి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ శనివారం కామారెడ్డి కలెక్టరేట్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, తరుగు పేరుతో రైతుల నుంచి పెద్దఎత్తున ధాన్యం కోత విధిస్తున్నారని ఆరోపించారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. మంత్రి వెళ్లిన తర్వాత కలెక్టర్‌ను కలిసిన విప్ గంప గోవర్ధన్ కేంద్రాల్లో ఉన్న ధాన్యం బస్తాలను వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తాను ప్రత్యక్ష ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు. మిల్లర్లతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు.

వైద్యం మెరుగుపడాలె..

- ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత
- ప్రైవేటుకు వెళుతున్న రోగులు
- నేడు జిల్లాలో మంత్రి హరీశ్‌రావు పర్యటన



సాక్షి, కామారెడ్డి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకల సంఖ్య పెరుగుతున్నాయి. మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. కానీ సరిపడా వైద్యులు, సిబ్బంది లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. చాలా చోట్ల వైద్యులు లేక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆదివారం జిల్లాలోని ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావ్ జిల్లాలోని ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అయితే ఇక్కడ వైద్యుల కొరత వేధిస్తోంది. సిబ్బంది కొరత కూడా ఉంది. గాంధారి, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, పిట్లం సీహెచ్‌సీలతో వైద్యులు, సిబ్బంది లేరు. దీంతో సరైన సేవలందడం లేదు. గాంధారిలో మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనంలోనే ఆస్పత్రి కొనసాగుతుంది. ఇక్కడ ఆధునిక సౌకర్యాలతో భవనం నిర్మించాల్సిన అవసరం ఉంది. బిచ్కుంద, జుక్కల్‌లో భవనాలు నిర్మించి ప్రారంభించినా వైద్యులు లేరు. వైద్యులను నియమించాల్సిన అవసరం ఉంది. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డెలివరీలు పెరిగాయి. అందుకు అవసరమైన మేర గైనకాలజిస్టులు లేకపోవడంతో పనిభారం పెరిగి వైద్యులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ ట్రామా కేర్ సెంటర్ ఉన్నప్పటికీ క్షతగాత్రులను గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. స్థానికంగానే వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లా ఆస్పత్రిలో సీటీ స్కాన్ లేకపోవడంతో రోగులను ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు పంపిస్తున్నారు. దీంతో పేదలు ఇబ్బంది పడుతున్నారు. సీటీ స్కానింగ్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. ఎల్లారెడ్డి నియోజక వర్గ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రిని నిర్మించేందుకు నిధులు మంజూరై శంకుస్థాపన చేస్తున్న నేపథ్యంలో కావాల్సిన వైద్యులు, సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

పర్యటన షెడ్యూల్

మంత్రి హరీశ్‌రావు ఆదివారం ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తారు. మెదక్ మీదుగా ఉదయం 10.30 గంటలకు నాగిరెడ్డిపేట మండలం పోచారం వద్దకు చేరుకుంటారు. మంత్రికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి లింగంపల్లి కలాన్ వద్ద పోచారం ప్రధాన కాలువపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 11.30 గంటలకు ఎల్లారెడ్డిలో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం గండిమాసానిపేటలో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు లింగంపేటలో జరిగే బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొంటారు.

రిజిస్ట్రార్‌ను నిర్ణయించేది ఈసీనే..

- లేఖ ద్వారా స్పష్టం చేసిన రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ
- ఈసీ తీర్మానాలు ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరిక

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయాల చట్టం 1991 సెక్షన్ 15(1) ప్రకారం పాలకమండలి (ఈసీ) ద్వారానే రిజిస్ట్రార్‌ను నియమిస్తారని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి లేఖ ద్వారా స్పష్టం చేశారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ నుంచి శనివారం తెలంగాణ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌గుప్తా, కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, ఈసీ మెంబర్లకు లేఖ అందింది. సెక్షన్ 15(1) ప్రకారం మూడేళ్లు లేదా అంతకంటే తక్కువ కాలం రిజిస్ట్రార్‌ను నియమించే అధికారం ఈసీకే ఉంటుందని లేఖలో స్పష్టం చేశారు. యూనివర్సిటీ యాక్ట్ 1991 నిబంధనలు మార్చే అధికారం కేవలం ఛాన్స్‌లర్ కే ఉంటుందన్నారు. వీసీకి తాత్కాలికంగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ను నియమించే అధికారం లేదని లేఖలో పేర్కొన్నారు. ఈసీ తీర్మానాలు అమలు చేయకుండా ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిణించాల్సి ఉంటుందని లేఖలో హెచ్చరించారు.

5వ తేదీలోపు వివరణ ఇవ్వండి

తెయూ వీసీ వర్సెస్ ఈసీగా మారిన పరిణామాల్లో వీసీ రవీందర్ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఏప్రిల్ 26న, మే 5న జరిగిన ఈసీ సమావేశాల్లో ఆమోదించిన తీర్మానాలు రద్దు చేయాలని వీసీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు హైకోర్టు శుక్రవారం(26న) ప్రతివాదులైన రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ, తెయూ క్యాంపస్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్, కాలేజియేట్ కమిషనర్ నవీన్‌మిట్టల్, ఈసీ నియమించిన రిజిస్ట్రార్ యాదగిరి తదితరులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 28న జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రతివాదులు వీసీ హక్కులు, విధులను అతిక్రమించినట్లుగా పరిగణిస్తున్నట్లు కోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జూన్ 5లోపు తగిన వివరణ ఇవ్వాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

క్లుప్తంగా

రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



ఖిక్కనూరు: రైతుల భూ సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఊరుకునే ది లేదని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ భిక్కనూరు తహసీల్దార్ ప్రేమ్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దా ర్ కార్యాలయంలో ఫైళ్లు చిందర వందరగా ఉండ టంపై అసహనం వ్యక్తం చేశారు. రైతులు తమ సమస్యల గురించి ఫిర్యాదు చేసినా, పట్టించుకోవడం లేదని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. అధికారులు తమ పద్ధతి మార్చుకుని రైతులకు సేవలు అందించాలని సూచించారు. ఎంపీపీ గాలిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ నాగభూషణంగౌడ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

సారంగపూర్‌లో న్యాయసదస్సు



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని సారంగపూర్ శివారులోని జిల్లా జైలులో శనివారం న్యాయసదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయ సహాయ డిఫెన్స్ న్యాయవాదులు సభ్యులు మాట్లాడుతూ.. ఖైదీలకు ఉచిత న్యాయసహాయం అందిస్తామని తెలిపారు. ఖైదీలకు సంబంధించిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయ సహాయ డిఫెన్స్ చీఫ్ న్యాయవాది రాజకుమార్ సుబేదార్, ఉప డిఫెన్స్ న్యాయవాది ఉదయ్‌కృష్ణ, అసిస్టెంట్ డిఫెన్స్ న్యాయవాదులు, జిల్లా డిప్యూటీ జైలర్ సాయి కుమార్ పాల్గొన్నారు.

ప్రతి గింజ కొనేది సీఎం కేసీఆరే..

- ముందస్తు వరినాట్లతో పంట నష్టం జరగదు
- రాష్ట్రంలో మొదటి రైతు అవగాహన సదస్సు ఇక్కడే..
- నెమ్లి సదస్సులో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): రైతులు పండించిన ప్రతి గింజను కొనేది దేశం మొత్తం మీద ఒక సీఎం కేసీఆర్ మాత్రమేనని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం నస్రుల్లాబాద్ మండలంలోని నెమ్లి గ్రామంలో గల శ్రీ షిర్డీ సాయి కల్యాణ మండపంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ముందస్తు వరి నాట్ల వలన ప్రకృతి వైపరీత్యాలతో జరిగే పంట నష్టం నుంచి రైతులు తప్పించుకోవచ్చని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సీఎం ఆదేశారని.. దీంతో బాన్సువాడ నియోజకవర్గంలో ముందే నిర్వహిస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు సాగుపై సలహాలు సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో కేవలం 36లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించే వాళ్లం కానీ ప్రస్తుతం 1.36 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం తెలంగాణ రాష్ట్రంలో ఉత్పత్తి అవుతుందన్నారు. అందులో నిజాంసాగర్ ఆయకట్టు కింద 1.25 లక్షల ఎకరాల పంట సాగు జరుగుతుందన్నారు. అందుకే ప్రతి రైతు ముందస్తు వరినాట్లు వేయడం వలన పంట నష్టం జరగదన్నారు. వర్షాకాలం పంటలు జూన్ మొదటి వారంలో నాట్లు పూర్తయి అక్టోబర్‌లో 15 వరకు కోతలు పూర్తవుతాయన్నారు. దీంతో నవంబర్‌లో వచ్చే తుపాన్‌లకు పంట నష్టం జరగదన్నారు.

జూన్‌లో దశాబ్ది ఉత్సవాలు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు స్పీకర్ పోచారం పేర్కొన్నారు. జూన్ 2న జెండా ఆవిష్కరణ తర్వాత రోజు నుంచి ప్రతిరోజు కార్యక్రమాలను ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. 21 రోజుల పాటు ప్రతి శాఖకు సంబంధించిన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఏఈవోలపై అసహనం

క్షేత్రస్థాయిలో ఏఈవోలు పని చేయడం లేదని స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నారు మడులు వేసిన నివేదికలను తయారు చేయమని ఆదేశిస్తే ఒక్కరు కూడా సరైన నివేదిక ఇవ్వలేదన్నారు. కొన్నిచోట్ల రైతు వేదికలను తెరవడం లేదని తన దృష్టిలో ఉందన్నారు. ప్రతి ఏఈవో రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, ఎంపీపీ పాల్త్య విఠల్, సర్పంచ్ గంగామణి, జెడ్పీటీసీ జన్నుబాయి, జిల్లా రైతుబంధు చైర్మన్ అంజిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్ర మోహన్, బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు క్రమబద్ధీకరణ

- వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజ్
- ఉత్తర్వులు అందజేసిన డీఎంహెచ్‌వో
- మరికొంతమంది కాంట్రాక్ట్ పద్ధతిలోనే కొనసాగింపు

మోర్తాడ్(బాల్కొండ): వైద్య ఆరోగ్య శాఖలోని కొందరు కాంట్రాక్టు ఉద్యోగులకు ఎట్టకేలకు రెగ్యులరైజ్ ఉత్తర్వులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుదర్శనం అందించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ సీఎం కేసీఆర్ గతనెల 30న సచివాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రకటించిన విషయం విదితమే. సీఎం ప్రకటన మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈనెల 4నే ఉత్తర్వులను జారీ చేశారు. ఆ సమయంలోనే ఇంటర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు క్రమబద్ధీకరణ ఉత్తర్వులను అందుకుని వారు పనిచేస్తున్న కళాశాలలోనే కొత్తగా ఉద్యోగంలో చేరినట్లు రికార్డులను అందచేశారు. వైద్య ఆరోగ్య శాఖలోను ఇదే నెల 4న ఉత్తర్వులను అందుకోవాల్సి ఉన్నా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయం జాప్యం చేసిందనే విమర్శలున్నాయి. 22 రోజుల ఆలస్యం తర్వాత వైద్య ఆరోగ్య శాఖలోని మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(మేల్)లకు రెగ్యులరైజ్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మొదట ఆరుగురు స్టాఫ్‌నర్సులకు ఉత్తర్వులను జారీ చేశారు. రెండో విడతలో 42 మంది ఎంపీహెచ్ఏలకు ఉత్తర్వులను అందించారు. అలాగే ముగ్గురు ఫార్మాసిస్టులు, ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లు, ముగ్గురు ఓపీ ఏఎన్ఎంలను కూడా రెగ్యులరైజ్ చేశారు. గతంలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా జిల్లాలో 101 మంది వైద్య ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాల్సి ఉండగా ఇందులో కేవలం 57 మందికి మాత్రమే క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయూష్, క్షయ విభాగం, కేంద్ర, ప్రపంచ బ్యాంకు పథకాల ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో నియమించబడినవారు రెగ్యులరైజ్ కాలేదు. ఆలస్యంగానైనా వైద్య ఆరోగ్య శాఖలోని కొందరు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేయడంతో తమ 20ఏళ్ల కల సాకారమైందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పనిచేస్తున్న చోటే కొనసాగింపు

క్రమబద్ధీకరణ చేయబడిన ఉద్యోగులను గతంలో పనిచేస్తున్న చోటే కొనసాగిస్తూ ఉత్తర్వులను జారీ చేశాం. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత సాధించిన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఉత్తర్వులను అందించాం. వీరంతా తాము పని చేస్తున్న చోటే జాయినింగ్ ఆర్డర్‌ను ఇవ్వాలని సూచించాం.
– డాక్టర్ సుదర్శనం, డీఎంహెచ్‌వో, నిజామాబాద్

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న నారాయణ గుప్తా

భిక్కనూరు: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణగుప్తా డిమాండ్ చేశారు. తెయూ సౌత్ క్యాంపస్‌లో శనివారం నిర్వహించిన కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 1300 మంది కాంట్రాక్టు అధ్యాపకులు ఉన్నారని, వారిని రెగ్యులరైజ్ చేస్తామని సీఎం హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేరని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద చదువుకున్న ఇంటర్, డిగ్రీ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకులను ప్రభుత్వం క్రమబద్ధీకరించిందని, కానీ తమను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులు సునీత, నరసయ్య, రమాదేవి, వైశాలి, నిరంజన్ శ్రీకాంత్, దిలిప్‌లు పాల్గొన్నారు.

తెయూలో..

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని తెయూ కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు తెయూ పరిపాలనా భవనం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కాంట్రాక్టు అధ్యాపకులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

వేణుగోపాల్‌కు డాక్టరేట్ ప్రదానం



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి చెందిన హోటల్ వ్యాపారి కోల వేణుగోపాల్‌కు శనివారం తమిళనాడు హోసూర్‌లోని ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన కాన్వకేషన్ కార్యక్రమంలో తమిళనాడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కెపి మనోకరణ్, ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ ఫౌండర్ ఎంజీ రామశర్మ స్వామీజీ, ఇంటర్నేషనల్ చైల్డ్, కన్నడ ఫిలీం యాక్టర్ హెచ్ఎం మీనాక్షిల చేతుల మీదుగా ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు. వేణుగోపాల్ మాట్లాడుతూ.. తాను చేసిన గోసేవ, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను యూనివర్సిటీ వారు గుర్తించి డాక్టరేట్‌ను ప్రదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సేవా కార్యక్రమాల్లో భార్య వాణి, కూతురు ఆధ్యల సహకారం ఎంతగానో ఉందన్నారు.

సదాశివనగర్ వాసికి..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన డాక్టర్ ప్రభాకర్‌రాజ్, రాజ్యలక్ష్మి కుమారుడు నవోదయ రాజు ఉత్తమ పీహెచ్‌డీ థీసిస్ అవార్డుకు ఎంపికయ్యాడు. గుజరాత్‌లోని పారుల్ యూనివర్సిటీకి చెందిన పారుల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద అండ్ రీసెర్చ్‌లో రాజు క్రియాశరీర డిపార్ట్‌మెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. అదే యూనివర్సిటీలో పీహెచ్‌డీలో అడ్మిషన్ తీసుకొని వివిధ దేహ ప్రకృతి సమూహాల తెలివితేటల స్థాయిలలోని వ్యత్యాస్యాలను ధృవీకరించారు. దీంతో ఈ అధ్యయనం యూనివర్సిటీలో రీసెర్చ్ ఎక్స్‌లెన్స్ అవార్డులకు నామినేట్ చేయబడగా.. రాజు ఉత్తమ పీహెచ్‌డీ థీసిస్ అవార్డు దక్కింది. గ్రూప్–5 ఆయుర్వేద, హోమియోపతి అవా ర్డును గెలుచుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో 'కామారెడ్డి'కి తృతీయ స్థానం



బాస్కెట్‌బాల్ పోటీల్లో బహుమతి అందుకుంటున్న కామారెడ్డి జట్టు

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్ర మంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలికల విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ ములుగు జిల్లా, తృతీయ వికారాబాద్ జిల్లా జట్లు పొందాయి. బాలుర విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ బహుమతి వికారాబాద్, తృతీయ బహుమతి కామారెడ్డి జిల్లా జట్లు కైవసం చేసుకున్నాయి.

రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన నలుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి సీఎం కప్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మధు శనివారం తెలిపారు. నిజామాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సీఎం కప్ పోటీల్లో మగ్గిడికి చెందిన నవీన, స్పందన, మానస, కీర్తితో పాటు అరవింద్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. దీంతో క్రీడాకారులను సర్పంచ్ సుద్దపల్లి సుమలత, సర్పంచ్ భర్త సుద్దపల్లి నర్సయ్య, వీడీసీ సభ్యులు అభినందించారు.

క్రైం కార్నర్

కేజీ గంజాయి పట్టివేత

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ శివారులోని చాందినీ దాబా సమీపంలో శనివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి కేజీ 50 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేస్తున్నారు. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్ర నుంచి బోధన్ వైపునకు వస్తున్న ఆటోలో నాందేడ్ పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మహ్మద్ షఫీ, జ్యోతినాథ్ దినకర్(జీవన్), మహ్మద్ ఫెరోజొద్దీన్‌లు గంజాయి అక్రమంగా తరలిస్తున్నారన్నారు. తనిఖీల్లో భాగంగా ఆటోను పోలీసులు తనిఖీ చేయగా గంజాయిని పట్టుకున్నారు. నిందితులను విచారించగా నాందేడ్‌కు చెందిన బాలు అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేశామని, నిజామాబాద్‌లో విక్రయిస్తామని వెల్లడించారు. అనంతరం వారిని ఉప తహసీల్దార్ వద్దకు తీసుకెళ్లి, పంచనామా చేయించి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ముగ్గురిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఏఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడిచేసి, పేకాడుతున్న నలుగురిని అదుపులో తీసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు శనివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో శుక్రవారం రాత్రి దాడి చేశామన్నారు. 52 పేకాట ముక్కలు, రూ.6720 నగదు దొరకడంతో వాటిని స్వాధీనం చేసుకొని, సీజ్ చేశామన్నారు. పేకాడుతున్న నలుగురిని అదుపులో తీసుకొని, కేసు నమోదు చేశామన్నారు.

మహిళ అదృశ్యం

నిజామాబాద్ సిటీ: నగర పరిధిలోని మాధవనగర్‌కు చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు శనివారం ఎస్సై లింబాద్రి తెలిపారు. మాధవనగర్‌కు చెందిన సోని అలియాస్ లత(23) ఈ నెలా 22న ఉదయం బయటకు వెళ్లి, తిరిగి ఇంటికి చేరుకోలేదు. అప్పటి నుంచి ఆమె కుటుంబ సభ్యులు ఎంత వెతికిన ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సోని మామ బొడ్డు నడ్పి భాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులో సీటు కోసం గొడవ



ఇరువర్గాలను సముదాయిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ వద్ద జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సులో సీటు విషయమై ప్రయాణికుల మధ్య గొడవ జరిగింది. హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో సీటు కోసం రెండు కుటుంబాల మధ్య గొడవ జరుగగా.. ఓ కుటుంబం వారు ఫోన్‌లో తమ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు బస్సును అర్గుల్ వద్ద ఆపి మరో కుటుంబంపై దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితులు జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

బీబీపేట: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు వల చుట్టుకొని మృతిచెందిన ఘటన మండలంలోని శేరిబీబీపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలు ఇలా.. శేరిబీబీపేట గ్రామానికి చెందిన పూస కేషయ్య(41) వృత్తి రీత్యా చేపలు పట్టేవాడు. తుజాల్‌పూర్ గ్రామ శివారులో ఉన్న నిమ్మకుంటలో చేపల వేటకు శుక్రవారం ఉదయం వెళ్లగా అందులో మునిగిపోయాడు. దీంతో రాత్రి వరకు గాలింపు చేపట్టినా వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం ఉదయం వలకు చుట్టుకొని పైకి తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



ప్రమాదంలో మృతి చెందిన ప్రకాష్

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని కందర్‌పల్లి వద్ద నేషనల్ హైవేపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బిచ్కుందకు చెందిన హాజి ప్రకాష్(30) బైక్‌పై మద్నూర్ వైపు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీధర్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

నిజాంసాగర్(జుక్కల్): అప్పుల బాధతో ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని తెల్గాపూర్ గ్రామానికి చెందిన పున్న పార్వతి(40)ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చలేదు. అలాగే యాసంగి పంట వడగండ్ల దాటికి నేలరాలడంతో మనోవేదనకు గురైంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 24న ఆమె ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకుంది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కుటుంబీకులు బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. శనివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం సేవిస్తూ వృద్ధుడి మృతి



మృతిచెందిన నాగయ్య

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలోని వైన్స్ పర్మిట్ రూమ్‌లో మద్యం సేవిస్తూ తాడెం గ్రామానికి చెందిన తిరుపతి నాగయ్య (70) అనే వృద్ధుడు మృతిచెందినట్లు ఎస్ఐ మహేష్ శనివారం తెలిపారు. నాగయ్య పర్మిట్ రూమ్‌లో కూర్చొని మద్యం తాగుతుండగా, అకస్మాత్తుగా కుప్పకూలాడు. దీంతో స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, నాగయ్య అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. వృద్ధాప్య కారణంతోనే చనిపోయినట్లు మృతుడి కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య



భానుప్రసాదు మృతదేహం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గైని భాను ప్రసాద్(25) చిన్నప్పటి నుంచి మూర్చ వ్యాధితో బాధపడుతుండేవాడు. కుటుంబ సభ్యులు ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినప్పటికీ రోగం నయం కాలేదు. దీంతో అతడు మానసికంగా బాధపడుతుండేవాడు. తనకు ఇష్టం లేకున్నా పెండ్లి చేశారని తరచుగా చెప్పేవాడు. అతడి భార్య గీతాంజలి వారం రోజుల క్రితం తన తల్లిగారిలైన లింగంపేట్ మండలంలోని కోర్పోల్‌కు వెళ్లింది. ఈక్రమంలో శుక్రవారం రాత్రి జీవితంపై విరక్తి చెందిన భానుప్రసాద్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

మంజీర నదిలో పడి బాలుడు..



బాలుడి మృతదేహం

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండల పరివాహక ప్రాంతంలో గల మంజీరా నదిలో ఓ బాలుడు ప్రమాదవశాత్తు పడి, నీటమునిగి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై బాల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం పెద్ద నాగూర్ గ్రామానికి చెందిన వాసర ఉలుగొండ (15) కొన్ని రోజుల క్రితం గొర్రెలను కాయడానికి బీర్కూర్ మండలానికి తన తాత(తల్లి తండ్రి)తో కలిసి వచ్చాడు. శనివారం గొర్రెలను కాస్తూ మంజీరాలో వాటికి నీరు తాగించి, ఒడ్డుకు దాటించే సమయంలో నదిలో చెక్‌డ్యాం కోసం తవ్విన గుంతలో పడి మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు గజఈత గాళ్లతో వెతికించి సాయంత్రం శవాన్ని వెలికి తీశారు. మృతుడి తాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు. గతంలో ఓ కుటుంబం మొత్తం మంజీరా నదిలో నీట మునికి మరణించిన ఘటన మరువక ముందే మరో బాలుడు మృతిచెందడం మండలంలో చర్చనీయంశంగా మారింది.

ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం



భిక్కనూరులో దగ్ధమవుతున్న స్కూటర్

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఓ ఇంటి వద్ద నిలిపిఉంచిన ఎలక్ట్రిక్ స్కూటర్ శనివారం వేకువ జామున దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన చల్మెడ విశ్వనాథం ఎప్పటిలాగే తన ఎలక్ట్రిక్ స్కూటర్‌ను శుక్రవారం రాత్రి తన ఇంటి ముందర నిలిపి, ఇంట్లోకి వెళ్లి నిద్రకు ఉపక్రమించాడు. శనివారం వేకువ జామున ఎలక్ట్రిక్ స్కూటర్ అగ్నికి ఆహుతి అవుతుండడంతో స్థానికులు అతడికి సమాచారం అందించారు. వెంటనే తను బయటకు వచ్చేసరికి వాహనం పూర్తిగా దగ్ధమై ఉంది. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

మాక్లూర్: మండల కేంద్రంలోని డక్‌ఫారం వద్ద ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండుగులు చొరబడి అమ్మవారి మెడలో ఉన్న మంగళ సూత్రాలు అపహరించుకపోయారు. ఈ ఘటన ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలో రికార్డయింది. ఆలయ కమిటీ సభ్యుడు ప్రసాద్‌గౌడ్ అందించిన వివరాల మేరకు, ఆలయంలోని అమ్మవారి విగ్రహానికి సంప్రదాయ బద్ధంగా ఉండాల్సిన నగలన్నింటిని పెట్టినట్టు తెలిపారు. గుర్తు తెలియని దుండగుడు వాటన్నింటిని గమనించే చోరీ పాల్పడినట్టు అనుమానం వ్యక్తం చేశారు. సీసీ పుటేజీలో చిక్కిన దుండగుడి ఫొటో ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ప్రసాద్‌గౌడ్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ గ్రామ శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడగా, ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న బైకును రాంపూర్ నుంచి ఎల్లారెడ్డికి వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో రెండు బైక్‌లపై ప్రయాణిస్తున్న నలుగురు కిందపడి గాయపడ్డారు. అటువైపుగా వెళ్తున్న ఎమ్మెల్యే సురేందర్ తన వాహనాన్ని ఆపి క్షతగాత్రులను అంబులెన్సులో ఆస్పత్రికి పంపించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాంపూర్ గ్రామానికి చెందిన మోహన్‌ను బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

నవీపేట మండలంలో..

నవీపేట: మండలంలోని కమలాపూర్ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారని ఎస్సై రాజారెడ్డి తెలిపారు. కమలాపూర్ నుంచి నవీపేట వైపు స్కూటీపై వస్తున్న మహిళా హోంగార్డు సుధారాణి, కానిస్టేబుల్ సంధ్యలను ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో సుధారాణి, సంధ్యలకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన నిజాంపూర్ గజ్జన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు

సిలిండర్ పేలి ఇద్దరికి..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కన్‌కల్ గ్రామంలో శనివారం సాయంత్రం సిలిండర్‌పేలి ఇద్దరికి గాయాలు అయ్యాయని పోలీసులు తెలిపారు. గ్రామంలోని మెహెర్‌బాబా మందిరం వద్ద వాచ్‌మెన్‌గా పని చేస్తున్న గ్రామానికి చెందిన గాండ్ల సాయిలు, భజనలు చేయడానికి వచ్చిన నితీష్‌కుమారు భక్తుల కోసం సిలండర్‌పై టీ చేస్తున్నారు. ఈ క్రమంలో సిలిండర్ రెగ్యులేటర్ వద్ద మంటలు చెలరేడంతో వారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాండ్ల సాయిలు